# ఈ భూమి మనదిరా!

-గంటి భానుమతి

మోల నుంచి మోకాలు దాకా కప్పే ఓ చిన్న గళ్ళబట్ట తప్ప, మిగిలిన శరీరం అంతా నగ్నంగా ఉండే సీనయ్య, తల తప్ప మిగిలినదంతా నగ్నంగా ఉండే తాటిచెట్ల మీద నుంచి కల్లు కుండలు తీస్తూ కిందపడి ఎముకలు విరిగి మంచమెక్కాడు.

"రేపట్నించి, కల్లు తీయడం నేర్చుకుంటాను నారయ్య మామ దగ్గిరకెల్లి..." అన్నాడు పదో క్లాసులోకి అడుగెట్టిన పళ్ళాలయ్య. ఆ రాత్రి వణ్ణం తిండాని కూచుంటూ.

తల్లి వెంకాయమ్మ ఆనందించింది.

రేపట్నించి తిండి మెతుకులకి అక్కడా యిక్కడా వెతుక్కోనక్కర్లేదని.

"వీడు చాటు బిడ్డడు కాదు. బాద్దెత తెలిసిన వాడు..." గుండెల్లోంచి దుఃఖం వచ్చి కళ్ళ దగ్గర ఆగి పోయి, నీటి బొట్లల్లో బయటికొచ్చింది. బాల్యానికి, బడికి సెలవ యిచ్చేయడానికి సిద్ధపడ్డ కొడుకుని చూశాడు నీరు నిండిన కళ్ళతో.

"వొద్దురొరే, ఆ పని మాత్రం వద్దు. దొరబాబు దగ్గర పొలంపన్లు నేర్చుకోరే, (రైతువి కావాలా నువ్వు భూఁవున్న రైతువి కావాలా), భూఁవరకే కందా, నేనీ పని చేస్తంట..."

"నేను భూఁవి కొంటా... మన భూఁవి మనం చేద్దాం..." అన్నాడు తొమ్మిదో క్లాసులోకి వచ్చిన అప్పన్న.

"ఆఁ... కవుర్లు బానే ఉంటాయి. భూఁవికొండం అంటే మాట్లేంటీ? అప్పనంగా ఎవరూ వీడానికి రెడీగా లేరు..." రెండు చేతులు అడ్డంగా తిప్పుతూ అంది లచ్చమ్మ. సీనయ్య ముసలి తల్లి.

"వేదో ఉజ్జోగం చేత్తా- దబ్బు తెత్తా... భూఁవి కొంటా..." ఉత్సాహంగా అన్నాడు.

"బావుందిరొరే... అలగే కల కంటూండు... మనం చిల్లులున్న జల్లెడతో నీల్లెత్తుతున్నాం. అద్దెలుసుకో... వెన్ని రోజులయినా మన బతుకులింతే... వెన్ని మాట్లేత్తాం చిల్లులకి..."

"ఇలక్కాదు, వెంకన్నబాబు దుబాయ్ అంపుతాట్ట. వెల్లి కనుక్కుంటా..."

సీనయ్య ఆశ్చర్యంగా కొడుకుని చూశాడు.

"వింకా, చిన్నాడివనుకుంటున్నా... వెంత పెద్దాడి వయ్యావురా!" అంది లచ్చమ్మ మనవడి వీపు నిము రుతూ...

"వప్పుడే వొద్దురొరే... నీక్కొంచం గ్యానం రానీ రొరే... అయినా దుబాయంటే కవుర్లేంటీ? పక్కనుం దేంటీ, యిలగనుకోగానే అలగెల్లొచ్చేడానికి... వెల్టం అంత వీజీ కాదు..." అంది వెంకాయమ్మ.

"ఉప్పట్నుంచి కదలేస్తే, వెప్పుడో వప్పుడు అంపు తాడు. దుబాయెల్లి దబ్బు అంపుతా, వప్పుడు మన భూఁవి మనమే చేస్కుంటాం..."

"ఎల్లెవిరా!" అన్నాడు పళ్ళాలయ్య.

"అప్పీనూ..." అన్నాడు ఉత్సాహంగా.

ఒక్కసారి నిశ్శబ్దం.

అందరి కళ్ళ ముందు ఒకే దృశ్యం.

బాధలు కంటి చుట్టు- గూడుకట్టుకున్నా, అలసి పోయిన కళ్ళకి ఆశాదీపాల్లాంటి, మిణుకు మిణుకు మంటున్న కలలు కంటి ముందు ఆకారాల్ని ఏర్పరు స్తున్నాయి.

భూమి... ఆ భూమి పొరల్ని చీలుస్తు నాగేటి చాళ్ళు... ఎడ్లు, పనిచేస్తున్న యింట్లో వాళ్ళు... వరి... కుప్పల కొద్దీ వరి...

ఎర్ర జీరల్తో, నీళ్ళు నిండిన కళ్ళతో, ఆ దృశ్యాన్ని చూస్తూ ఉండిపోయారు.

ఆ స్వప్నాన్ని వదలలేక చాలాసేపు అలాగే ఉండి పోయారు.

"బాగానే ఉంది సంబడం... అలా చూత్తూండి పోతారేంటీ? కలల వెనక్కాల వెల్టం అంటే పిల్లి తన తోక తానే పట్టుకోడం..."

ఆ మర్నాడే మేడ దొరబాబు గారింట పాలేరు పనికి కుదిరిపోయాడు. మధ్య మధ్యన పొలం పన్లు నేర్చుకోవాలనుకున్నాడు.

దుబాయి వెళ్ళే ప్రయత్నాలు మానలేదు అప్పన్న.

"ఉరే... మనం కూలీలం రా... అన్నయ్యలాగా కూలిపన్లోకెల్లిపో... అంతంత దూరాలెల్లి భూఁవులు కొనకపోతే ఏం! దేవుడే మనకి భూఁవుల్ని వీయ

లేదు..."

"దేవుడీకుండా– పొరపాటు చేశాడు. దేవుడీక పోతేనేం నేను కొంటా..."

"ఒకళ్ళ కింద పన్చేయక్కర్లేదు. మన భూంవి... మన సేద్యం... సొతంత్రంగా ఉండచ్చు... ఎన్నాళ్ళీ పాలేరు పన్లు?" అన్నాడు పళ్ళాలయ్య.

ఇంట్లో ఉన్న కాస్త వెండి అమ్మి మరో కొంత అప్పుపెట్టి వెంకన్న బాబుకిచ్చాడు అప్పన్న. మరో ఏడాదికి దుబాయ్ ప్రయాణం అయ్యాడు.

ఇంట్లో వాళ్ళు, బంధాలు, అనుబంధాలు నీళ్ళు నిండిన కళ్ళకి మసక మసక బారిపోతూంటే, ఊరు దాటి, ఏరు దాటి, సముద్రం దాటి, దుబాయెళ్ళి పన్లో చేరిపోయాడు అప్పన్న.

ఏడాది తిరిగాకా, వొంట్లోని రక్తం, మాంసం, ఎన్ని రూపాయలుగా మారిందో లెక్క చూసి యింటికి డబ్బు పంపాడు.

అన్నగారు ఓ చెక్క భూమి కొన్నాడు.

మరో రెండేళ్ళు గడిచాయి. అరెకరం అమిరింది.

సీనయ్యకి కాలు ఆప్రేషన్ చెయ్యాలన్నారు.

"అప్పన్న కుత్తరం రాయినేటీ బాబూ!" అన్నాడు పళ్ళాలయ్య.

లచ్చుమ్మ ఒక్కసారి లేచింది.

"ఏటి రాసేది? ఏం రాత్తావ్? ఏంవని రాత్తావ్? నీ బాబు కాలు కాప్రేసన్ అని రాత్తావ్! అవునోరే... వాడెప్పుడైనా ఏదై రాసాడా!..." బాధగా, గట్టిగా అంది.

సీనయ్య కలగ చేసుకున్నాడు.

"అవున్రా... ఉత్తరం రాయమాక... ఆడప్పుడైనా ఆడి కస్టం మనకి చెప్పాడా! తిన్నాడో, తినలేదో చెప్పాడా! ఏ కరకు నేలన ఎలా నిద్దరోతున్నాడో మనకి తెలుసా! అసలేం పని చేత్తన్నాడో మనంవెప్పుడైనా కనుక్కున్నామా! అసలడిగామా! లేదుకందా! ఉప్పుడు ఉత్తరం రాసి ఆడ్ని బాధపెట్టడం దేనికి?"

ఇంకెవరూ ఏం మాట్లాడలేదు.

ఎకరం అమిరింది. ఎడ్లు ఇంటి పక్కన కుడితి తాగుతూ, గడ్డి తింటూ కులాసాగా ఉన్నాయి.

తల్లి గుర్తొచ్చింది, తండ్రి గుర్తొచ్చాడు. ఊరు గుర్తొచ్చింది. గుండెలు ఒక్కసారి పొంగాయి ఆనందంతో.

ఊరికి ప్రయాణం అయ్యాడు. సముద్రం దాటాడు, ఏరు దాటాడు. ఊళ్ళోకి అడుగుపెట్టాడు.

మరిచిపోయిన మాటలు గుండెల్లోపల్నించి వచ్చాయి ఊరిని చూడగానే.

ఎదురు చూస్తున్నా స్నేహితులని కలుసుకున్నాకా ఏమేం మర్చిపోయాడో తెలుసుకున్నాడు.

నవ్వడం. మనసు విప్పి మాట్లాడం.

ఇంటికెళ్ళాకా తెలిసింది, యింకా దేనికి మొహం వాచి ఉన్నాడో కడుపు నిండా తిండికి, కంటి నిండా నిద్రకి, శరీరం కోరుకునే విశ్రాంతికి.

రక్తాన్ని, చెమటని, కండల్ని రూపాయల్లోకి మార్చడంలో మునిగిపోయాడు. ఒక్కసారి పైకి తేలాకా అర్థం అయింది, కోరుకున్న ప్రపంచం ఎక్కడ ఉందో

## రాగఝరి

దిక్కులనిండా
ఊపిరి కురుస్తున్నది.
అది బిస్మిల్లాఖాన్
షహనాయినుండేనని చెప్పాలా!
ఈ ఊపిరి వాయువే కావచ్చు
కాని అది లోపలికి వెళ్ళి
ఒక మహాసృష్టి వేదికపైన
పునీతమై వెలికి వచ్చింది.
    భావం నాదమై
    నాదం రాగమై
    రాగం సమ్మోహనమై...
    బిస్మిల్లాఖాన్
    నీకు నమస్కారం చాలదు.
మబ్బుల్లోంచి
చినుకు చినుకుగా
నేలకు ప్రయాణం.
పక్షులవైపు ఎగిసే చూపుల్ని
పువ్వులు బంధించినట్టు,
వేళ్ల కొసలకు
వెన్నెల అంటుకున్నట్టు,
విశ్వమంతా
ఒక వేదనా జీరగా మారినట్టు.
నిజంగా ఆ సన్నాయి
నిర్వచించలేని హాయి!
నేను కాశీకి వెళ్లినప్పుడు
గంగమ్మతో జరిపే సంభాషణ
బిస్మిల్లా గురించే.

–ఎన్. అరుణ

అని.

రాత్రి అన్నం తిన్నాకా యింటి ముందు ముడత మంచం మీద వాలాడు.

ఆకాశం అంచుల్నించి చిక్కటి చీకటి జారి పోతోంది.

గుమ్మం దగ్గర ఈత చాప వేసుకుని లచ్చమ్మ వెంకాయమ్మ కాల్చిన తేగల్ని వేసుకుని తింటూ కూచున్నారు.

"సచ్చునారాయనొస్తున్నాడు..." అంది వెంకా యమ్మ.

"అప్పుడే పడకేసావేంటీ? నదు... అలా మొగదాకా ఎల్దాం..." అన్నాడు వస్తూనే సత్యనారాయణ.

అప్పన్న లేచాడు. మొగ దగ్గర రమేషున్నాడు. గుడి అరుగుల మీద కూచున్నారు.

దంత శుద్ధి అంటు చేగోడీలు, పుణుకులు మధ్యలో పెట్టాడు వీరయ్య, "దుబాయి కవుర్లు చెప్పరా!" అన్నారు.

"అక్కడి కవుర్లకేంవుంది కానీ, యిక్కడెలాగుందీ?"

"నాదా! మాదా! ఎకరం, అరెకరం ఉన్న చిన్నపాటి రైతులదా!"

చేగోడి నోట్లో వేసుకోబోతూ, ఆ ముక్కని అలాగే చేతిలో ఉంచుకుని చూసాడు సత్యనారాయణ.

"మీదేలే..."

"ఎలాగుంటుందంటే... మూడు పిండి వంటలు, ఆరు రకాల కూరలు పచ్చళ్ళు అయితే అవన్నీ వండు కున్న వాళ్ళకేలే... వాళ్ళని, ఆశగా చూట్టం, మాడుతున్న కడుపుల్తో..."

డీలా పడిపోయాడు.

ఇంతేనా! దుబాయ్ వెళ్ళేముందూ అంతే... వెళ్ళి వచ్చాకా కూడ అంతే. అవే బతుకులూ!

"అదేంట్రా... మార్పు లేదా!"

నవ్వాడు రమేషు.

"మార్పు లేకేం... బ్రహ్మాండమైన మార్పు... మునుపు గంజినీళ్ళు... యిప్పుడు అన్నం... మునుపు కల్లు తీసేవాళ్ళు... ఇప్పుడు సారాబట్టీలు అవ్వీ... యివి చాల్దేటీ!"

"మీ భూంవులు తక్కువేకందా! కౌలుకి తీసుకోలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు అప్పన్న.

"సదేలే... అదేదో సాంవెత చెప్పినట్లుంది. కౌలుకి తీసుకున్నాం. అయినా అంతే ఎరువులకి, పురుగు మందులకీ కటకట. కరెంటుకి కటకట. బ్రోకర్లు, బాంకర్లు... అంత అయ్యాకా మళ్ళీ వడ్డీ సోంవనాథం గతి. అన్నీ అయ్యాయి అనుకుంటే... దేవుడి వొంకర చూపు... పంట సాయం చేతికొచ్చీలోగా వెన్ని యిబ్బం దులో... పండింది పంటికి, యింటికి రాదు. సరిపోదు కందా! ఇదిరా అన్నదాత నడ్డి... రోజు రోజుకి వొంగి పోతోంది..."

ఆ మాటలు నాలిక చివర్నించి రాలేదు. గుండె లోతుల్లోంచి వచ్చినవి.

"ఇంకోటి విను- నీ గుండె చెరువైపోతుంది. మన సూరన్నలేదు... రెండుసార్లు ఫెయిలయ్యి నీతోపాటూ ఏడో క్లాసు రాసి, బడి మానేసాడు... గుర్తొచ్చాడా... ఆ సూరన్న..."

అప్పన్న తలూపాడు తెలుసన్నట్లుగా.

పొలం గట్లల్లో టమాటాలు, బెండకాయలు నారే సాడు. అయ్యన్న విరక్కాసాయనుక్కో... మార్కెట్కి తీసు కెళ్తే దళారులంతా కుమ్మక్కయ్యి కొనలేదు. రెండ్రోలు చూసాడు. మూడోరోజు రూపాయికి నాలుక్కిలోలు చొప్పున అమ్మేసాడు. తీరామోసి చూస్తే వాడు... పది రూపాయలకి కిలో చొప్పున పెద్ద బజారులో అమ్మట్ట

## ఓ శేషేంద్రమా!

**అం**జలి ఘటియింపని వారు
అరుదు సాహితీ లోకంలో
బుధ జన కోటి నుండి
ఏరులై పారె- కన్నీటి ధారలు
భాష్పాంజలులే- కాబోలు!
అవని అంతా కలబోసె
ఓ సాహితీ సాగరమై!
ఆత్మస్థైర్యము వీడి
కవులు, గాయకులూ
ఒంటరి బ్రతుకులేలని
నీ పాటలో తోటలో
విహరించి, పాడుకొనగా
అవధరించి నీ మది చెలియించి
అభయహస్త మీయగ
నీ మృదు మందహాస మోము చూడ
సాహితీలోకాన నీ చరితం
సదా సశేషం! ఓ శేషేంద్రమా!

-శ్రీమాన్ కాశ్యప

మనోడి కళ్ళల్లోంచి రక్తం చుక్కలు రాలాయనుక్కో..."

గుండె బరువెక్కింది అప్పన్నకి-

"ఉరే... మనూర్లో దేవుడి పెళ్ళికి మయసభ నాటకం వేసారు గుర్తుందా! అదే. అదేరా... ఇక్కడ జరుగుతున్నది. దుర్యోధనుడు మయసభకెళ్లాడు. ఓ చోట గచ్చుని చూసాడు. గచ్చే కందా అని కాలేసాడు. తీరా మోసి చూస్తే అవి నీళ్ళయ్యి కూచున్నాయి. అంతే... జారి పడ్డాడు... ఏం తేడా లేదు. మన బజార్లన్నీ మయసభలనుక్కో...!

"ఏంవిటో... ఎంతో ఊహించాను."

"సదేలే... ఊహలు బానే ఉంటాయి. మన బతుకులు ఏటికి ఎదురీతలే..."

మనసంతా కకావికలయింది. లేచాడు.

"మళ్ళా రేపు కలుద్దాం..." ఎంత ఆశగా వచ్చాడో అంత నిరుత్సాహంగా అనిపిస్తోంది.

మర్నాడు పొద్దెక్కేవరకూ లేవలేదు అప్పన్న. ఇంట్లో ఎవరూ లేపలేదు. పాపం... ఇన్నాళ్ళు నిద్ర సరిగా పోలేదు... పడుకోనీ... అనుకున్నారు.

లేచేసరికి మధ్యాహ్నం అయిపోయింది. ఇంట్లోను... యింటి వెనక్కాల తచ్చాడుతూ గడిపేసాడు.

సాయంత్రం అయ్యేసరికి పళ్ళాలయ్య భుజాన నాగలితో కనిపించాడు. అప్పన్నకి అన్నగారి నలా చూస్తుంటే శిలువని మోస్తున్న క్రీస్తులా అనిపించాడు.

"నేనూ రేపట్నించి పొలానికొత్తాను. ఇంకో రెండు మూడు ఎకరాలు కవులికి తీసుకుందాం... ఎవర్నైనా కనుక్కో..."

"దరిద్రుడు తలంటుకుందామంటే వడగళ్ళ వానొచ్చిందిట... అలగుంది మన పని..." నాగలిని ఓ మూల ఉంచి లోపలికెళ్ళాడు స్నానం చెయ్యడానికి.

చిన్నప్పటిది, గుర్తొచ్చింది అప్పన్నకి.

"మామ్మా! ఈ భూంవులు పొలాలు ఎవరు చేసారేంటీ?" అడిగాడు నానమ్మ లచ్చమ్మని. అప్పుడు అప్పన్న పదేళ్ళవాడు.

"దేవుడురా!" అంది వాడిని దగ్గరికి తీసుకుంటూ.

"దేవుడయితే... అందరికీయ్యాలి కందా! మరి మేడ దొరబాబు గారికి, సత్తెంబాబు గారికే ఎందుకిచ్చాడు... మనకెందు కీలేదు?"

"డబ్బులెవ్వీ? మనకి లేదు కందా!"

"అవుతే... డబ్బులెవురిస్తే ఆల్లకే భూంవులిస్తాడా దేవుడు?"

లచ్చమ్మ మాట్లాడలేదు. ఆమెకే సరిగా తెలీదు జవాబు.

"ఈ దొరబాబులు భూంవుల్ని తెచ్చుకుని పుట్టారా! పుట్టాకా దేవుడి దగ్గర్నుంచి తెచ్చుకున్నారా!..."

లచ్చమ్మ మాట్లాడలేదు. కానీ ఈ రోజున కూడా అప్పన్నని అదే ప్రశ్న వేధిస్తోంది.

పేదోడి బతుకు ఎప్పుడూ ఒకటే. పేదోడికి భూంవుణ్ణానికి వీల్లేదు.

"అప్పన్నా! వణ్ణం తిండానికి రారా..." అంది వెంకాయమ్మ.

చిక్కటి నలుపులోకి మారిపోతున్న ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తున్న అప్పన్న ఉలిక్కిపడి, వచ్చి కంచం ముందు కూచున్నది.

"ఈ వేపున ఏదో ఫాక్ట్రీ పెడ్తారుట. భూంవులు కొంటారుట."

"ఎవరి భూంవులు?"

"మనందరివీ న్నూట"

"ఎవరన్నారేటీ?" మంచం మీదున్న సీనయ్య అన్నాడు.

"పెకాశం బావు అందరంవూ భూంవులివ్వాల్ట. కొనుక్కుంటార్ట."

"మనం ఈక్కర్లేదు..." అప్పన్న గట్టిగా అన్నాడు.

"బావుంది. ఇది మరీ బావుంది... వాళ్ళేవళ్ళో వచ్చి, అల్లన ఫాక్ట్రీ పెట్టేత్తాంవంటే- రండి బాబూ... రండి మా భూంవులు కొనండంటే, మా భూంవులు కొనమంటూ, ఆర్తి పళ్ళాల్తీసుకుని ఎదురొత్తామను

## అనంత నానీలు

క్యాలండర్... అయిపోతే
కాలం- ఆగుతుందా...
అంకెలు... మార్చుకుంటే
రోజులు... వారాలు- నెలలూ
మారతాయి! అదే కేలండర్...!

ఫొటో ఎగ్జిబిషన్‌లో
ప్రతీ ఫొటో అద్భుతంగానే
ఉంటుంది
చూస్తూంటే పలకరిస్తాయి
ముట్టుకుంటే ముద్దాడమంటాయి!

-అనంత ప్రభాకర్ దత్తు

## ప్రగతివైపు పయనిద్దాం

ఉదయాలు, సాయంత్రాలు షరామామూలే
వర్షాలు, ఎండలు, చలీ మామూలే
పుట్టటం, పెరగటం, చావటం అంతకన్నా మామూలే
సంఘటనలే జీవనానికి సాక్షి
సన్నివేశాలే బ్రతుకును కదిలించినా, రగిలించినా!
ఎన్నాళ్ళు బ్రతికాం అని కాదు
ఎలా బ్రతికాం అన్నది ప్రశ్న
జీవితం మొత్తంమీద మనం ప్రతిస్పందించింది
ఎన్నిసార్లు అని
మానవత్వపు కోణంలో మమతా సమతలను కలుపుకొని,
నవత వైపు నడిచింది ఎప్పుడెప్పుడని?
అవును, గత చరిత్ర వర్తమానానికి మార్గదర్శకత్వం
కావాలి
వర్తమానం భవిష్యత్తుకు బాటలు వేయాలి
విశ్వజనీనత పాటై, బ్రతుకునిండా ప్రతిధ్వనించాలి
ఒక ఆపన్నహస్తాన్ని స్పృశించిన వేళ
ఒక ఆకలి కడుపుకు తృప్తిగా అన్నంపెట్టిన సమయం
ఒక ఆవేదనకు స్పందించి కన్నీళ్ళు తుడిచిన సందర్భం
మంచివైపు పయనించే వ్యక్తికి తోడుగా నిలిచిన క్షణం
ఎదుటివాడి ఎదలో అనురాగాల సెలయేటి
స్వరాలూదిన వైనం
మనిషి మనిషిగా, మనీషిగా, మహాత్ముడిగా ఎదిగిన
కథలు, గాథలు కావాలిప్పుడు
ప్రకృతిని పరవశింపజేసి,
కృతిగా మార్చే మాంత్రికులు రావాలి
వికృతియైన ప్రకృతి విలయతాండవపు కుండపోత
నుండి
కాపాడే గొడుగు కావాలి
ఎటువంటి కఠినమైనా కదిలించే మానవీయ స్పర్శ
కావాలి
అప్పుడే ప్రతి ఉదయం ఉషోదయం
ప్రతి వేసవీ వెన్నెల మయం
ప్రతి శీతపు అరుణారుణరాగకమష్ట
చుంబన శ్రీయుత కౌగిలింతల పులకింత
ఆవిష్కరణలు శుభంగా జరగాలంటే
రస స్పర్శ కలిగిన జీవితం కావాలి
ఇక ప్రతిరోజూ భలే మంచిరోజు.

**-విజయ. బి.**

కుంటున్నారేమో..." తింటున్న అన్నం ముద్దల్ని విసురుగా కంచంలో పడేస్తూ అంది.

"ఇది మా భూఁవి. గవర్మేంటు భూఁవికాదు. అడగ్గానే యిచ్చేదానికి. యివ్వం... ఉరే అప్పన్నా, పళ్ళాలయ్యా రేపు అంతా వెళ్ళి గొడవ పెట్టండి..." లచ్చమ్మ ఆజ్ఞాపించింది.

"ఫాక్ట్రీ పెట్టాకా, మనకందులో ఉజ్జోగాలిత్తార్ట..."

అప్పన్న తింటూ తింటూ లేచిపోయాడు.

"అలా అన్చెప్పి భూఁవులు తీస్కుంటారా! మేమమ్మం... అంటే... బలవంతంగా లాక్కుంటారా! కంటి తుడుపుగా ఉజ్జోగాలిత్తారా! ఏం ఉజ్జోగాలిత్తారు? అసలేం ఉజ్జోగాలొత్తాయి మన చదువులకి? ఏం పెద్ద చదువులు పొడిచేసామని పెద్ద ఉజ్జోగాలిత్తారు? మన చదువులకి ఎలాంటి ఉజ్జోగాలిత్తారో దుబాయిలో చూసాను కందా... మన చదువుకి కూలి పని తప్ప మరోటి రాదు... మరోటీరు... దుబాయెల్లి కూలి పన్జేసి డబ్బులట్టుకొచ్చింది, భూఁవి కొన్నదీ వీళ్లడగ్గానే విచ్చేదానికా! నేనివ్వను... సంపేసినా సరే..." ఆవేశంగా అని మళ్ళా కంచం ముందు కూచున్నాడు.

"అయినా... ఈళ్ళకి మన భూఁవులే కావాల్సొచ్చాయా! దొరగార్ల కన్నేసి ఎకరాలున్నాయి కందా! వాళ్ళవి తీస్కుంటే సరి... మనకి భూఁవులుండడానికి సొతంత్రం లేదా ఏం! గుండాల్ని పెట్టేనా సరే యిచ్చేది లేదు..." అన్నాడు పళ్ళాలయ్య.

"యింటొ అనడం కాదు... రేప్పొద్దున్న నలుగుర్నీ పోగేయండి పోట్లాడండి... మీకు తోడుగా నేనూ వత్తాను..." అంది లచ్చమ్మ.

"కూలివాడికీ, రైతుకి, చెమట- రత్తం ఓటేలే... భూఁవి కోసం ఆ రెంటినీ యిత్తాడు. ఇప్పటికే మనూళ్ళో చాలామంది అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగేసి చచ్చారు. యింకా చెమట తడి ఆరని అస్తిపంజరాలు భూఁవి పొరల్లో ఉన్నాయి... అందులోకి మరికొన్ని... ప్రాణాలు పోయినా సరే యిచ్చేది లేదు... పోరాడుదాం... పోతే ఏం పోతుంది ఈ ప్రేణాలే కందా... భూఁవి పిల్లలకైనా మిగుల్తుంది..." సీనయ్య కంఠం వొణికింది.

అందరి కళ్ళల్లో నీరు... ఆ క్షణాన్ని, వాళ్ళని ఆ కన్నీరే కట్టేసింది. ఆది అంతం ఉన్నది అదొక్కటే. అంతరాయం లేకుండా వెంకాయమ్మ, లచ్చమ్మ ఏడుస్తున్నారు. మొగవాళ్ళు నిశ్శబ్దంగా చెరువవుతున్న గుండెని అదమడానికి ప్రయత్నిస్తున్నారు. ■